సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



అన్నీ తానై..
బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా చెమటోడుస్తున్నారు మంత్రి హరీశ్‌రావు. సుమారు 16 గంటల పాటు 12 కార్యక్రమాలకు హాజరయ్యారు. వివరాలు 10లో ▸



బీఆర్ఎస్ పాలనలో..
బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరిగిందని, మరోసారి ఆ పార్టీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ కోరారు. వివరాలు 10లో ▸



భెల్‌ను కాపాడింది సీఎం
కార్మిక రంగానికి సీఎం కేసీఆర్ పెద్దన్నగా నిలుస్తూ వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

రాజేశ్వర్‌రావు దేశ్ పాండేను కలిసిన హరీశ్‌రావు



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేశ్వర్ రావు దేశ్ పాండే

కొండాపూర్(సంగారెడ్డి): బీజేపీ రాష్ట్ర నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండేను మంత్రి హరీశ్‌రావు గురువారం మండల పరిధిలోని మల్లెపల్లిలోని తన ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. దేశ్‌పాండే బీజేపీ నుంచి సంగారెడ్డి అసెంబ్లీ టికెట్‌ను ఆశించారు. కానీ, పార్టీ టికెట్ వేరే అభ్యర్థికి రావడంతో రాష్ట్ర నాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి హరీశ్‌రావు హాజరై బీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు. పార్టీలో సముచిత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముందుగా దేశ్‌పాండే మద్దతుదారులకు మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ కండువాలు వేసి పార్టీలోకి చేర్చుకున్నారు. అనంతరం సీఎం కేసీఆర్‌తో సమావేశం అయ్యేందుకు హరీశ్‌రావే తన వాహనంలో రాజేశ్వర్ రావు దేశ్ పాండేను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

ఓటర్లను చైతన్యం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్ : జిల్లాలోని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా ఓటర్లను చైతన్య చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. గురువారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా స్వీప్, నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు తదితరులతో స్వీప్, ఓటరు చైతన్యంపై చేపట్టిన, చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్స్, కాలనీలు, మున్సిపాలిటీలలో, పరిశ్రమలలో, అన్ని సంస్థల్లో ఓటరు అవేర్ నెస్ ఫోరమ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. నిర్వహణకు మేనేజ్‌మెంట్‌లోనే ఒకరిని నోడల్ అధికారిగా పెట్టాలన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, రిజిస్టర్ నిర్వహించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

- మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

వట్‌పల్లి (అందోల్): జోగిపేటలో శనివారం నిర్వహించే ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ.నారాయణ పిలుపునిచ్చారు . గురువారం అందోల్ మండల పరిధిలోని మసానిపల్లి గ్రామంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని 9 మండలాల ముదిరాజ్ బంధువులు పెద్ద ఎత్తున ఈ సభకు హాజరు కావాలన్నారు. ముఖ్యఅతిథులుగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, బిత్తిరి సత్తి, ఫిషరిష్ డెవలప్ మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు పిట్టల రవీందర్ పాల్గొంటున్నారన్నారు. ముందుగా స్థానిక క్లాక్ టవర్ నుంచి ర్యాలీగా బయలుదేరి శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ నాయకులు డీబీ నాగభూషణం, మండల అధ్యక్షుడు తెనుగు గంగాధర్, నాయకులు మల్లేశం, భాగయ్య, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

జోగిపేట (అందోల్) : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, చంటి క్రాంతి కిరణ్ ను గెలిపిస్తే అందోల్ నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందని అందోల్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10,11,12 వార్డుల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ, మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు సార శ్రీధర్ నాయకులు శివ శేఖర్, వీరభద్ర రావు, రవీందర్ గౌడ్, ఉల్వాల వెంకటేశ, శంకర్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు





గురువారం నర్సాపూర్ ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సభకు హాజరైన ప్రజలు

నర్సాపూర్‌కు కాళేశ్వరం జలాలు

- కౌడిపల్లికి డిగ్రీ కాలేజీ.. నర్సాపూర్‌కు ఐటీఐ
- మండల కేంద్రంగా రంగంపేట
- దౌల్తాబాద్ కాసాల పంచాయతీలను కలిపి మున్సిపాలిటీ
- రోజుకు 24గంటల కరెంటు కావాలన్నా సునీత గెలవాలి
- బీఆర్ఎస్ ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

నర్సాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నర్సాపూర్ నియోజకవర్గానికి అనేక వరాలు ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గానికి త్వరలోనే కాళేశ్వరం జలాలు అందిస్తామని, పిల్లుట్ల కాల్వ పనులు కొనసాగుతున్నాయని, పూర్తి కాగానే తాను వచ్చి కొబ్బరికాయ కొడుతానని చెప్పారు. నర్సాపూర్ నియోజకవర్గం వజ్రం తునక అయితదన్నారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కోరిక మేరకు కౌడిపల్లికి డిగ్రీ కాలేజీని మంజూరు చేశానన్నారు. మంజీరా, హల్దీవాగులపై చెక్ డ్యాంలు నిర్మించ వద్దని కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధం పెట్టిందని, అయితే.. తాము నిషేధం ఎత్తివేసి వాటిపై అవసరమైన చోట చెక్ డ్యాంలు నిర్మించామని, దీంతో అవి జీవనదులుగా మారాయని తెలిపారు. చెక్‌డ్యాంల కింద వేసవిలో సైతం రైతులు బాగా పంటలు పండిస్తున్నారని చెప్పారు. రోజుకు 24గంటల కరెంటు కావాలన్నా, మంజీరా, హల్దీ వాగుల కింద నిర్మించిన చెక్ డ్యాంలను నీటితో నింపాలన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే నీళ్లు వస్తాయని సీఎం పేర్కొన్నారు. కోమటిబండ నుంచి ఇంటింటికి నల్లా నీళ్లు ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డిల అభ్యర్థన మేరకు నర్సాపూర్‌కు ఐటీఐ మంజూరు చేస్తానని, రంగంపేటను మండల కేంద్రం చేస్తామని, దౌల్తాబాద్ కాసాల గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని సీఎం ఈ సందర్భంగా ముస్లింలను కోరారు. మైనార్టీ గురుకులాలను డిగ్రీ కాలేజీలుగా మార్చనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో అన్ని మతాలకు తమ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని వివరించారు.

మదన్‌రెడ్డికి గౌరవప్రదమైన పదవి

సునీతారెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినప్పటికీ తన చిరకాల మిత్రుడు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఏ పదవీ లేకుండా ఖాళీగా ఉండడని, ఆయనను గౌరవ ప్రదమైన పదవిలో ఉండే విధంగా చూస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. మదన్‌రెడ్డి, సునీతారెడ్డిల సహకారంతో నర్సాపూర్ బాగా అభివృద్ధి చెందుతోందని, సునీతారెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ నర్సాపూర్ గులాబీ జెండా అడ్డా అని చెప్పారు. కాంగ్రెస్ , బీజేపీలను నమ్మొద్దని ప్రజలను కోరారు. గాలి అనిల్‌కుమార్ పాత వాడేనని సొంతగూటికి వచ్చారన్నారు.

సునీతమ్మను గెలిపించే బాధ్యత మనందరిది : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ శిష్యుడిగా, ముఖ్య అనుచరుడిగా తనకు ముద్ర పడిందని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి గెలిపించే బాధ్యత తనతో పాటు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందన్నారు. పదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. కార్యకర్తలు, నాయకుల మధ్య ఎలాంటి మనస్పర్థలు లేకుండా గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, సభలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, వెంకట్రాంరెడ్డి, కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, మన్సూర్, గౌరై వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్‌లో చేరిన గాలి అనిల్‌కుమార్, ఎంపీపీ జ్యోతి, శ్రీకాంత్‌గౌడ్, మ్యాడం బాలకృష్ణ పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం: సునీత

నర్సాపూర్ రూరల్: శివ్వంపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. మంజీరా, హల్దీ వాగులపై 14 చెక్‌డ్యామ్‌లు నిర్మించి సస్యశ్యామలం చేశారన్నారు. కాళేశ్వరం జలాలను హల్దీవాగులోకి వదిలి పంటలను ఎండకుండా చేసిన మంత్రి హరీశ్‌రావును కొనియాడారు. నియోజకవర్గంలో సాగు చేసుకుంటున్న లావణి, పోడు భూములకు హక్కులు కల్పించాలని సీఎంని కోరారు. నర్సాపూర్‌కు మరో 7 వేల ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన గాలి అనిల్‌కుమార్, సింగాయిపల్లి గోపీలను ఈ సందర్భంగా అభినందించారు. సీఎం ఆశీర్వాదం, మదన్‌రెడ్డి సహకారంతో తనకు ఓటువేసి గెలిపించాలని సునీతారెడ్డి ప్రజలను కోరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే



మాట్లాడుతున్న బండి సంజయ్

- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

రామచంద్రాపురం/పటాన్‌చెరు: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, ప్రజా సమస్యలపై, నిరుద్యోగ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తే తనపై, తమ పార్టీ కార్యకర్తలపై కేసీఆర్ ప్రభుత్వం అనేక కేసులు పెట్టిందని బండి సంజయ్ ఆరోపించారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రామ చంద్రాపురం పట్టణంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ పార్టీ గెలువద్దని ఈ రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రజా సమస్యలపై, ఉద్యోగాల కోసం పోరాటం చేస్తే తనపై, తమ పార్టీ కార్యకర్తలపై కేసీఆర్ ప్రభుత్వం అనేక కేసులు పెట్టిందని తెలిపారు. ఈ రెండు పార్టీలు ఒక వర్గానికి చెందిన ఓట్ల కోసమే పోటీ పడుతుందని తెలిపారు. హిందూ సమాజం ఐక్యమే బీజేపీ పార్టీకు మద్దతు ఇవ్వాలని కోరారు. అభివృద్ధి బీజేపీ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. పేదల రాజ్యం, రామరాజ్యం రావాలంటే బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తాము గెలిచిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అలాగే, పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి గ్రౌండ్స్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ఉన్న కారణంగా కుహనా లౌకిక వాదులు, హిందూ ప్రజలను విస్మరిస్తున్నారని తెలిపారు. ప్రచారంలో మసీదులోకి వెళ్లి తలపై టోపీలు పెట్టుకొని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధవి, పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

మూల మహోత్సవ వైభవం



వర్గల్ సరస్వతి అమ్మవారు

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి నెలవు వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రం గురువారం మూల మహోత్సవ వైభవంతో అలరారింది. జన్మనక్షత్ర వేళ తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారి మూలవిగ్రహానికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. సర్వాలంకార శోభితులైన అమ్మవారికి భక్తజన సామూహిక లక్షపుష్పార్చన, లలితాపారాయణం, సప్తశతీ, చండీ పారాయణం, చండీ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. కుంకుమార్చన చేశారు. వేడుకలో భక్తులు పాల్గొని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఛట్ పూజకు అనుమతి ఇవ్వండి

నందీశ్వర్ గౌడ్, అనుచరులు ఆందోళన



ఆందోళన చేస్తున్న నందీశ్వర్ గౌడ్ తదితరులు

పటాన్‌చెరు టౌన్: ఛట్ పూజకు అనుమతి ఇవ్వడం లేదని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్ గౌడ్, తన అనుచరులు గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. బీహార్ రాష్ట్ర ప్రజలు జరుపుకునే ఛట్ పూజకు పటాన్‌చెరు పట్టణంలోని మైత్రీ మైదానంలో నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలోనే నందీశ్వర గౌడ్ కుమారుడు ఆశీష్ గౌడ్ పెట్రోల్ పోసుకున్నాడు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. గతేడాది మైత్రి మైదానంలో ఛట్ పూజకు పెద్ద ఎత్తున జనం రావడంతో ఇబ్బంది తలెత్తిందని, వేరే చోట పెట్టుకోవాలని పోలీసులు సూచించారు.

మైక్రో అబ్జర్వర్స్ కేటాయింపు

సంగారెడ్డి టౌన్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎన్నికల పరిశీలకుల సమక్షంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు అవసరమైన మైక్రో అబ్జర్వర్స్‌ను ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించినట్లు డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ మాధురి తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు, వ్యయ పరిశీలకుల సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్ కుమార్, వ్యయ పరిశీలకులు నాజీమ్ జై ఖాన్, జిల్లా విద్యాధికారి, కలెక్టరేట్ ఏవో, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

వారంటీ లేని గ్యారంటీలు నమ్మొద్దు

- కాంగ్రెస్ నాయకులు ఇచ్చే సీసా, పైసలకు ఆశపడి ఓటు వేయొద్దు
- ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు



న్యాల్‌కల్ : మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): కాంగ్రెస్ పార్టీ ఇస్తానంటున్న వారంటీ లేని గ్యారంటీ పథకాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం న్యాల్‌కల్ మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. సభకు హాజరైన మంత్రి హరీశ్‌రావుకు పార్టీ మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. పక్కనున్న కర్నాటకలో సాధ్యం కాని హామీలను ఇచ్చి వాటిని నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అక్కడ 24 గంటలు కరెంటు ఇస్తామన్న కాంగ్రెసోళ్లు ఇప్పుడు కనీసం 5 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు మాట్లాడుతూ.. మరోసారి తనను ఆశీర్వదించి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు.ఎంపీ బీబీ పాటిల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్ అహ్మద్, తదితరులు మాట్లాడారు. అలాగే, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పిన మంత్రి హరీశ్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు. బీఎస్పీకి చెందిన నాయకుడు రాహుల్‌తోపాటు దత్తారెడ్డి, తదితరులు చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి దేవి ప్రసాద్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ, ఉపాధ్యక్షుడు గౌసొద్దీన్, జెడ్పీటీసీ సభ్యురాలు స్వప్న భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప, హద్నూర్ సర్పంచ్ వీరమణి రాజ్‌కుమార్‌తో పాటు శ్రీకాంత్‌రెడ్డి, దెశెట్టి పాటిల్, రవికుమార్, శ్రీనివాస్, పాండురంగారెడ్డి, పీటర్ రాజు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కర్నాటకలో హామీలపై ఆరా..

కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అక్కడ అమలు చేస్తున్న హామీల తీరుపై మంత్రి హరీశ్ రావు ఆరా తీశారు. సభ ప్రారంభం కాగానే కర్నాటకలో కాంగ్రెస్ వాగ్దానాలను ఏ మేరకు అమలు చేస్తుందో అక్కడి వారితో బంధుత్వాలు ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న హద్నూర్ గ్రామానికి చెందిన మల్లేశ్, మెటల్‌కుంటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి సభావేదిక పైకి మంత్రి పిలిచి అడిగాడు. అక్కడ కరెంట్ 5 గంటలే ఇస్తున్నారని, పింఛన్ కూడా తక్కువగా వస్తుందని, రైతు బంధు అసలు ఇవ్వడం లేదని వారు తెలిపారు. ఇలాంటి కాంగ్రెస్ పార్టీ కావాలా? లేక బీఆర్ఎస్ పార్టీ కావాలా? అని ప్రజలను మంత్రి ప్రశ్నించారు.

హ్యాట్రిక్ విజయం సాధిస్తాం

కోహీర్(జహీరాబాద్): సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కోహీర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి రాగానే కోహీర్‌కు డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తామన్నారు. నూతన బస్టాండ్‌ను సైతం నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రవంతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు యాదవ్, రామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, జావేద్, కలీం, అన్వాన్ జావేద్, భూమయ్య, వెంకట్‌రాంరెడ్డి, ఆనంద్, సందీప్, మొల్లయ్య, బాబీ, సిద్ధప్ప, సజ్జన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే బంజారాల సంక్షేమం

జహీరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే బంజారాల (గిరిజన) సంక్షేమం సాధ్యపడుతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాల్‌లో బీఎస్ఎన్ డైరెక్టర్, సర్పంచ్ శంకర్ నాయక్ అధ్యక్షతన గిరిజన సదస్సు నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు గిరిజనులను పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. కేసీఆర్ సీఎం అయ్యాకే పోడు భూములకు పట్టాలు ఇచ్చామని అన్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని 593 మంది రైతులకు 1,393 పోడుభూములపై హక్కులు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, ఐడీసీ చైర్మన్ తన్వీర్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు శంకర్ నాయక్, ఉమాకాంత్ పాటిల్, కిషన్‌రావు పవార్, విజయ్ మోహన్‌రెడ్డి, చిరంజీవిప్రసాద్, కుత్‌బుద్దీన్, విజయ్‌కుమార్, సుధీర్‌కుమార్, నామ రవికిరణ్, మాణిక్యమ్మ, యాకూబ్, నరేశ్, మోతిరాం, జహంగీర్, సంజీవరెడ్డి పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని బసవ మండపంలో సామాజిక వర్గాలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేశం, మంకాల్ సుభాష్, అల్లాడి నర్సింహులు, ముత్యాలచందు, ఎం.డి.తంజీం, తట్టు నారాయణ పాల్గొన్నారు.

ఆరు నెలలకు ఒక సీఎం మారుతాడు

- కాంగ్రెస్‌ను నమ్ముకుంటే అంధకారమే
- మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

పటాచెరుటౌన్: బీఆర్ఎస్ అంటే నమ్మకం.. కాంగ్రెస్ అంటే నాటకం అని, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు కాదు.. ఆరు నెలలకు ఒక ముఖ్యమంత్రి మారుతాడని హరీశ్‌రావు ఎద్దేశ చేశారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ చౌరస్తాలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార సభకు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమక్షంలో ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, చిట్కుల్ మాజీ సర్పంచ్ చిన్న రాములు, ఇస్నాపూర్ వార్డు సభ్యులు జనార్దన్ రెడ్డి, నారాయణ, ఊర్ల గోపాల్, సంపత్ కుమార్ రెడ్డి, చిట్కుల్ వార్డు సభ్యులు నర్సింగ్ యాదవ్ తదితరులు పార్టీలో చేరగా వారికి కండువా వేసి మంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే ఇక మిగిలేది అంధకారమే, ఎవరెన్ని కుట్రలు చేసినా కాబోయే ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అని ధీమా వ్యక్తం చేశారు. అమీన్‌పూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్


కేసీఆర్‌తో హరీశ్‌రావు ముచ్చట

హరీశ్ హాజరై.. అన్నీ తానై

- 16 గంటలు.. 12 కార్యక్రమాలు..
- రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాలతో బిజీబిజీ
- చేరికల కోసం కాంగ్రెస్, బీజేపీ నేతల ఇళ్లకు..
- మద్దతు కూడగట్టేందుకు సీపీఎం కార్యాలయానికి..
- బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడుస్తున్న మంత్రి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా చెమటోడుస్తున్నారు మంత్రి హరీశ్‌రావు. గురువారం జిల్లాలో బిజీబిజీగా గడిపారు. బుధవారం రాత్రి సంగారెడ్డిలోనే నిద్రించిన ఆయన ఉదయం ఏడు గంటల నుంచే తన దినచర్యను ప్రారంభించారు. రాత్రి పది గంటల వరకు సుమారు 16 గంటల పాటు వివిధ కార్యక్రమాలు, ప్రచార సభలతో క్షణం తీరిక లేకుండా గడిపారు. పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు బీఆర్‌ఎస్‌లో చేరేలా అన్నీ తానై వ్యవహరించారు.

ముఖ్యనేతల నివాసాలకు..

కాంగ్రెస్, బీజేపీలకు చెందిన రాష్ట్ర స్థాయి, జిల్లా నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరేలా మంత్రి హరీశ్‌రావు కీలకంగా వ్యవహరించారు. గురువారం ఉదయమే టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్ నివాసానికి వెళ్లిన పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సంగారెడ్డి టికెట్ ఆశించి భంగపడిన రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే నివాసానికి వెళ్లిన మంత్రి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు.

సీపీఎం కార్యాలయానికి స్వయంగా వెళ్లి..

జిల్లాలో సీపీఎం పార్టీ మద్దతు కూడగట్టేందుకు హరీశ్‌రావు స్వయంగా సంగారెడ్డిలోని ఆ పార్టీ కార్యాలయానికి వెళ్లారు. స్థానిక బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతప్రభాకర్‌తో కలిసి సీపీఎం నేతలతో చర్చలు జరిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మాత్రమే సీపీఎం పోటీ చేస్తోంది. మిగిలిన చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని ఆ పార్టీ నేతలను కోరారు.


గిరిజన సదస్సులో మాట్లాడుతున్న హరీశ్‌రావు

రోడ్ షోలు, కులసంఘాల సమ్మేళనాలు..

ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హరీశ్‌రావు పలు చోట్ల రోడ్‌షోలు, కుల సంఘాల నేతల ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం హద్నూర్‌లో జరిగిన ప్రజాఆశీర్వాద సభలో పాల్గొన్న మంత్రి కర్నాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఐదు నెలల్లోనే విఫలమైన తీరును వివరించారు. ఎస్టీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మంత్రి గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఎరుకల కులస్తులతోనూ ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఈనెల 23న జహీరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి నుంచి నర్సాపూర్‌లో జరిగిన సీఎం కేసీఆర్ బహిరంగసభకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం పటాన్‌చెరులోని ఇస్నాపూర్ సభకు చేరుకొని సభనుద్దేశించి మాట్లాడారు. ఇలా గురువారం రోజంతా సంగారెడ్డి జిల్లాలోనే గడిపారు.

మల్లేశ్‌తో ముచ్చటించిన మంత్రి..

హద్నూర్‌లో పర్యటించిన హరీశ్‌రావు కర్నాటక రాష్ట్రంతో బంధుత్వం ఉన్న మల్లేశ్ అనే వ్యక్తితో ముచ్చటించారు. స్థానికంగా ఓ ఫ్యాక్టరీలో ఉద్యోగిగా పని చేస్తున్న మల్లేశ్ కర్నాటకలోని పరిస్థితులను మంత్రితో తెలిపారు.

ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్


సభకు తరలి వస్తున్న జనం

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ అయ్యింది. సీఎం కేసీఆర్ ప్రసంగం గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి రావడంతో సభాప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆ పరిసరాలు ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో గులాబీమయంగా మారాయి. సభలో కాంగ్రెస్‌పై కేసీఆర్ నిప్పులు చెరిగారు.


కళాకారుల నృత్య ప్రదర్శన

బీఆర్‌ఎస్‌లో చేరికలు

నర్సాపూర్ రూరల్, శివ్వంపేట: ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, నర్సాపూర్ ఎంపీపీ జ్యోతి, మెదక్‌కు చెందిన పీసీసీ నేత మ్యాడం బాలకృష్ణ, అజ్మత్ అలీ, సురేష్‌నాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు చేరారు. అలాగే.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, కౌన్సిలర్ సునీత, బాల్‌రెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రాజేశ్ దేశ్‌పాండే, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ గడిల శ్రీకాంత్‌లకు సీఎం కేసీఆర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


గాలి అనిల్ కుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న సీఎం కేసీఆర్


సింగాయిపల్లి గోపి..


రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే..


మ్యాడం బాలకృష్ణ..

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ. 6 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని జయలక్ష్మి నగర్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు సెప్టెంబర్ 6వ తేదీన మెసేజ్ వచ్చింది. స్పందించిన ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తి చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ. 6 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదు తో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఆ ఉద్యోగి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి,అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అవ్వా.. నీ ఓటు కారుకే..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని చెలుకలపల్లిలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా మహిళా విభాగం నాయకురాలు రాజశ్రీ,, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, సరోజన, కనకవ్వలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వృద్ధురాలిని బుజ్జగిస్తూ.. కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు.



డప్పు కొడుతూ.. ఇస్త్రీ చేస్తూ..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో స్థానిక బీఆర్‌ఎస్ కౌన్సిలర్ నాయిని చంద్రం డప్పు కొడుతూ.. ఇస్త్రి చేస్తూ హరీశ్‌రావుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.



కూరగాయలు అమ్ముతూ..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి ఓ దుకాణం వద్ద కూరగాయలు విక్రయిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు బాగయ్య, ఉమేష్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి


ఓ హోటల్‌లో చాయ్ చేస్తున్న క్రాంతికిరణ్

ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరిగిందని, మరోసారి ఆ పార్టీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఓటర్లను కోరారు. మండలంలోని మోరట్గా, మామిడిపల్లి, కర్చల్, నాగన్‌పల్లి, రాయిపల్లి తదితర గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, డప్పులతో స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా గ్రామాలకు తన హయాంలో కేటాయించి నిధులు, చేసిన అభివృద్ధి, ఎన్నికల మేనిఫెస్టో గురించి ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మూడు గంటల కరెంటు సరఫరాతో ఇబ్బందులు తప్పవని ఆరోపించారు. 40 ఏళ్లు పాలించి గ్రామాలను, పేదలను పట్టించుకోని వారి మాయమాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. ఓ హోటల్‌లో ఆయన చాయ్ చేసి, డప్పు కొట్టి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో బసవరాజ్ పాటిల్, శంకర్, సిద్దప్ప పాటిల్, విఠల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లే..

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో కన్నీళ్లే మిగలడంతో పాటు బీఆర్‌ఎస్ పునర్నిర్మిస్తుందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. ములుగు మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(బహిలంపూర్)లో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన కేసీఆర్ ప్రసంగపాఠం 'కాంగ్రెస్ చేసిందేందీ?' అనే పుస్తకాన్ని గురువారం రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ములుగు మండల ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ పిర్యాల రవీందర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ యూత్‌వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాష, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలను ఓటు బ్యాంకుగా చూసారే తప్ప తెలంగాణను మానవ సంపదగా మార్చలేదని వారు ధ్వజమెత్తారు.

పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి

కొండపాక(గజ్వేల్): పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మండల ఇన్‌చార్జి లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం, కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల బాగు కోసం సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇస్తూ ఓట్ల కోసం కొత్త బిచ్చగాళ్ళ మాదిరిగా గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవి రవీందర్, కోల సద్గుణ, పొల్కంపల్లి నరేందర్, పిస్క అమరేందర్, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా..

సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతాప్రభాకర్

కంది(సంగారెడ్డి): తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని, సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతాప్రభాకర్ కోరారు. గురువారం కంది మండల పరిధిలోని చిమ్నాపూర్, కంది, తుంకిళ్ల తండా, గొల్లగూడెం తండా, కవలంపేట్, చేర్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసపూరిత కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. ఏనాడు అభివృద్ధిని పట్టించుకోని కాంగ్రెస్ నాయకు లు ప్రజలను మభ్యపెట్టేందుకు ఆచరణ సాధ్యంకాని హామీలను ఇస్తూ మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, సరళ పుల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణ గౌడ్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఖాజాఖాన్, మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మోహన్‌రెడ్డి, రామకృష్ణా రెడ్డి, శంకర్ గౌడ్, అబ్జల్, షఫీద్దీన్ బాబాతోపాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతా సతీమణి ఇంటింటి ప్రచారం

కొండాపూర్(సంగారెడ్డి): చింతా ప్రభాకర్ సతీమణి అరుణ మండల పరిధిలోని గంగారం, అనంతసాగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారానికి విచ్చేసిన అరుణకు మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు . ప్రతీ మహిళతో మాట్లాడుతూ.. పిలిస్తే పలికే నాయకుడు, అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న నాయకుడు చింతా ప్రభాకర్‌కు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పథకాలను చూసి ఓటు వేయాలని, ఎన్నికల సమయంలో వచ్చే నాయకుల మాటలు విని మోసపోవద్దని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుల చేరిక

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సీఎం కేసీఆర్ పాలన చూసి బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నడిమిదొడ్డి మోహన్, వినోద్ కుమార్, శ్రీనివాస్‌తోపాటు దాదాపుగా 50 మంది కార్యకర్తలు చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంజన్న, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, నాయకులు నగేశ్, మోతి సింగ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రభాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు


అనంతసాగర్‌లో ప్రచారంలో పాల్గొన్న చింతా ప్రభాకర్ సతీమణి అరుణ


కందిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

బండికి ఘన స్వాగతం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొనడానికి వచ్చిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి రెడ్డి నివాసానికి విచ్చేశారు. భవిష్యత్‌లో మంచి స్థానం కల్పిస్తామని గోదావరి అంజిరెడ్డికి భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గోదావరి అంజిరెడ్డి దంపతులతో మాట్లాడుతున్న బండి సంజయ్